# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి　సంపుటి: 09 సంచిక :253　ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్　తేది: శనివారం 14-12-2024　పేజీలు:4 వెల: 2.00


## అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలా సీతారామన్..

న్యూఢిల్లీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి అరుదైన గౌరవం దక్కించుకున్నారు. ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో చోటు సాధించారు. ఫోర్బ్స్ ఏటా వ్యాపారం, వినోదం, రాజకీయ, దాతృత్వం తదితర రంగాల నుంచి ప్రభావవంతమైన వ్యక్తుల ర్యాంకింగ్‌లను విడుదల చేస్తుంటుంది. ఈ ఏడాది కూడా ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో భారత్ నుంచి మొత్తం ముగ్గురికి చోటు దక్కింది. అందులో నిర్మలమ్మ తొలి స్థానంలో నిలిచారు. ఇక వరుసగా ఆరో సంవత్సరం ఈ జాబితాలో ఆమె చోటు దక్కించుకోవడం విశేషం. శక్తిమంతమైన మహిళల జాబితాలో నిర్మలా సీతారామన్ తొలిసారి 2019లో చోటు దక్కించుకున్నారు. ఆ ఏడాది ఆమెకు 34వ ర్యాంక్ దక్కింది. 2020లో 41వ స్థానం, 2021లో 37వ స్థానం సాధించిన ఆమె 2022లో 36వ స్థానం, 2023లో 32వ స్థానంలోనిలిచారు. ఇప్పుడు 28వ స్థానంలో చోటు దక్కించుకోవడం విశేషం. ఏటా తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ వస్తున్నారు. ఇక నిర్మలమ్మ తర్వాత ఈ జాబితాలో ప్రముఖ ఐటీ సంస్థల్లో ఒకటైన హెచ్‌సీఎల్

## ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎండగట్టాలి.. మంత్రి సీతక్క



బాసర,ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ గ్రామాల్లో ఎండగట్టాలని మంత్రి సీతక్క కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా ఇన్చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా పర్యటనలో భాగంగా బాసరలోని జీఎస్ గార్డెన్ లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. జిల్లాకు చేరుకున్న ఇంచార్జ్ మంత్రి సీతక్కను మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్ ఘన స్వాగతం పలికారు.రైతు భరోసాను ప్రభుత్వం తప్పక అందిస్తుందని, ప్రతిపక్ష పార్టీలు కావాలని రైతు భరోసాపై దుష్ప్రచారాన్ని చేపడుతున్నాయని రైతులు నమ్మొద్దన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న దుష్ట ప్రచారాన్ని కార్యకర్తలు ఎక్కడికక్కడ ఎండగట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన అంశాన్ని విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, వరి రైతులకు అందిస్తున్న 500రూపాయల బోనస్, 200 యూనిట్ల కరెంటు మాఫీ, ఉచిత బస్సు, పథకాలను అందిస్తున్నాట్లు మంత్రి తెలిపారు.నిర్మల్ జిల్లాలోని దిల్వాల్ పూర్ లో ఇత్తనాలు ఫ్యాక్టరీకి అనుమతులను గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని, కానీ ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి ఉసిగొల్పుతున్నారన్నారు. ప్రభుత్వం అభివృద్ధి పనులను ముమ్మరం చేస్తుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణరావు పటేల్, ట్రిబుల్ ఐటీ, బాసర ఆలయ అభివృద్ధి పరచాలని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

## చేసే పనులన్నీ చేసి అధికారులను బలిపశువు చేస్తున్నారు

హైదరాబాద్, డిసెంబర్ 13: రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదని, అందుకే దాడులు, అక్రమ అరెస్టు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. భూమి ఇయ్యను అన్నందుకు గిరిజన రైతులను జైలు లో పెట్టడం ఓకేనట.. జైలులో వారిని చిత్రహింసలు పెట్టడం ఓకేనట.. వారి కుటుంబసభ్యులను అర్ధరాత్రి ఇండ్ల మీద దాడిచేసి భయపెట్టడం, బెదిరించడం ఓకేనట.. నెల రోజులుగా వారికీ చెయ్యని నేరానికి బెయిల్ కూడా రాకుండా అడ్డుపడటం ఓకేనట.. గుండె జబ్బుతో ఉన్న పేషెంటుకు బేడీలు వేయించటం కూడా ఓకేనట అని కేటీఆర్ విమర్శించారు. చేసే దరిద్రపు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. ఇకనైనా క్షమాపణలు చెప్పి కేసులు రద్దు చేయాలని, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో రిమాండ్ అయిన హీర్యానాయక్‌కు కంది జైలులోనే బుధవారం మధ్యాహ్నం స్వల్పంగా గండెనొప్పి వచ్చింది. దీంతో జైలు వైద్యులు పరీక్షలు చేశారు. అక్కడే ఈసీజీ తీసి చికిత్స కోసం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు తరలించారు. సంగారెడ్డి దవాఖానలో ఈసీజీ ఇతర పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసి పంపించారు. బుధవారం రాత్రి మరోమారు హీర్యానాయక్‌కు గండెనొప్పి రావటంతో తిరిగి సంగారెడ్డి దవాఖానకే తీసుకురాగా వైద్యులు చికిత్స చేసి పంపించారు. గురువారం ఉదయం హీర్యానాయక్ గండెనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జైలు సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో కాకుండా



జైలు వాహనంలోనే చేతికి బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో వైద్యులు అశోక్, మజీద్‌ఖాన్ ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేయగా ఆసమయంలోనూ రైతుకు బేడీలు తీయలేదు. పరీక్షలు ముగిసిన తర్వాత మెరుగైన చికిత్స కోసం పంజాగుట్టలోని నిమ్స్‌కు తరలించాలని సూపరింటెండెంట్, వైద్యులు నిర్ణయం తీసుకున్నారు. హీర్యానాయక్ చాలారోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. 2డీ ఈకో పరీక్ష చేయగా గుండె బలహీనంగా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. సంగారెడ్డిలో కాథల్యాబ్ లేనందున నిమ్స్‌కు రిఫర్ చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. అండర్ ట్రయల్‌లో ఉన్న ఖైదీలకు సంకెళ్లు వేయవద్దని గతంలో కోర్టులు చెప్పినా అవేమీ పట్టించుకోండా కంది సెంట్రల్ జైలు పోలీసులు హీర్యానాయక్‌కు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించటం తీవ్ర విమర్శలకు దారితీసింది. జైలు అధికారుల తీరును గిరిజన, రైతు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

## రాజ్యాంగం అంటే సంఘ్‌బుక్ కాదు.. సంవిధాన్!

న్యూఢిల్లీ,భారత దేశంలో రాజ్యాంగం ఏర్పాటు చేసుకుని 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ కొనసాగుతుంది. ఇందులో విపక్షాల తరఫున వాయనాడు ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా చర్చను స్టార్ట్ చేశారు.తొలి ప్రసంగంలోనే అధికార ఎన్డీయేపై విమర్శలు చేశారు. ఇతర దేశాలతో పోలిస్తే మన స్వాతంత్ర్య పోరాటం చాలా ప్రత్యేకమైందన్నారు. సత్యం, అహింస అనే పునాదులపైనే మనం పోరాటాం చేశామని ఆమె తెలిపారు. అయితే, భారత స్వాతంత్ర్య ఉద్యమం ప్రజాస్వామ్య గళం.. దాని నుంచి ఉద్భవించిందే రాజ్యాంగం అన్నారు. ఇది కేవలం డాక్యుమెంట్ కాదు.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మౌలానా ఆజాద్ లాంటి లాంటి వారు ఎంతో మంది ఎన్నో ఏళ్ల పాటు పోరాటం చేశారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.అయితే, ప్రజా హక్కులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే అవకాశం రాజ్యాంగం కల్పించిందని ప్రియాంక గాంధీ అన్నారు. ఇది దేశ ప్రజలను కాపాడే సురక్షా కవచంలా ఉండటంతో.. దాన్ని అధికార ఎన్డీయే ప్రభుత్వం బలహీనపర్చేందుకు ఎన్నో కుట్రలు చేస్తుందని ఆరోపించారు. గత పదేళ్లలో ఈ రక్షణ కవచాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీనపర్చిందని విమర్శించింది. లేట్రల్ ఎంట్రీ, ప్రైవేటీకరణ లాంటి చర్యలతో రిజర్వేషన్లను బలహీనపర్చేందుకు మోడీ సర్కార్ యత్నిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ చూసిందని ఎద్దేవా చేసింది. అలా జరగకపోవడంతో ఆ ప్రతిపాదనలపై ఇప్పుడు వెనక్కి తగ్గిందని ప్రియాంక గాంధీ దుయ్యబట్టారు.ఇక, బీజేపీ గతం గురించే



మాట్లాడుతుంది.. దేశ ప్రగతి కోసం ప్రస్తుతం ఏం చేస్తున్నారో చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ డిమాండ్ చేసింది. దేశంలో జరిగే అన్నిటికీ నెహ్రూనే కారణమా అని ప్రశ్నించారు. నెహ్రూ పేరును, ఆయన ప్రసంగాలను మీరు పుస్తకాల నుంచి తొలగిస్తారేమో కానీ.. స్వతంత్ర్య పోరాటంలో, జాతి నిర్మాణంలో ఆయన పాత్రను చెరిపేయలేరని ఆమె అన్నారు. ఇక, రాజ్యాంగం అంటే సంఘ్ (ఆర్ఎస్ఎస్) బుక్ కాదు.. సంవిధాన్ అని చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా 2017లో జరిగిన ఉన్నావ్ అత్యాచార ఘటనను గుర్తు చేశారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు పోరాడే హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని చెప్పుకొచ్చింది.

## ప్రజా సమస్యలపై పోరాడే ఫార్ములే కేటీఆర్ : బాల్కసుమన



హైదరాబాద్, డిసెంబర్ 13: ప్రజా సమ్యస్యల మీద పోరాడే పోరాట ఫార్ములే కేటీఆర్ అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఆశా కార్యకర్తలైన, ఆడబిడ్డల మీద, గురుకుల పసిబిడ్డల ఫుడ్ పాయిజనింగ్ మీద స్పందించి సర్కార్ మెడలు వంచే ఫార్ములే కేటీఆర్ అని తెలిపారు. తెలంగాణ సంస్కృతి మీద జరుగుతున్న దాడులను ప్రశ్నించే ఫార్ములే కేటీఆర్, ఏడాదికాలంగా రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్న మూర?పు సీఎం ఆగడాలను,అన్యాయాలను నిలదీస్తున్న నాయకుడే మన కేటీఆర్ అని చెప్పారు. ప్రభుత్వానికి మింగుడుపడని, కొరకరాని కొయ్యగా మారి, ప్రజలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కేటీఆర్‌పై సర్కారు కుట్రలు, కుతంత్రాలకు కొదవలేదని విమర్శించారు. ప్రశ్నించడమే నేరమా, నిలదీయడమే పాపమా? అని ప్రశ్నించారు. లగచర్ల, దిలావర్‌పూర్‌పై, రైతుకు బేడీల మీద, విద్యార్థుల మరణాలపై, గురుకుల సంక్షోభాలపై నిలదీస్తున్నందుకే కేటీఆర్ కుట్రలా అంటూ నిలదీశారు. కిషన్ రెడ్డిని కిస్మత్ రెడ్డి అంటు విమర్శించిన సీఎం రేవంత్.. స్వయంగా వెళ్లి ఆయనకు సన్మానం చేస్తాడని, కిషన్‌రెడ్డి చేయించుకుంటాడని విమర్శించారు. ప్రజలను అరిగోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతిస్తారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు ఢిల్లీలో కుస్తీ పడతాయని, తెలంగాణలో మాత్రం దోస్తీ చేస్తాయన్నారు. మీ కుట్రలకు, కుతంత్రాలకు తమ నాయకుడు అదరడు, బెదరడని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటాడని, మీ అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలపై నిలదీస్తూనే ఉంటాడని స్పష్టం చేశారు.


## తెలంగాణ తల్లి రూపాన్ని ఏలా మార్చుతారు



హైదరాబాద్, డిసెంబర్ 13: తెలంగాణ తల్లి రూపాన్ని ఎలా మారుస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమంలో స్ఫూర్తి నింపిన రూపాన్ని విగ్రహంగా మలుచుకున్నామని చెప్పారు. తెలంగాణ తల్లిపై రేవంత్ రెడ్డి సర్కార్ గెజిట్ ఇవ్వడం దారుణమన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం కూడా భరతమాత విగ్రహంపై గెజిట్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి విగ్రహాలు పెట్టుకున్నామని, జీవో ఇస్తేనే వారి విగ్రహాలు పెడతామా అని ప్రశ్నించారు. ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి జీవో ఇచ్చారన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రయోజనాలే ముఖ్యమని, ప్రజలు కాదన్నారు. ఆ పార్టీది తెలంగాణ వాదం కాదని, కాంగ్రెస్ వాదమని విమర్శించారు. మీరు ముమ్మాటికీ కాంగ్రెస్ వాదులే తప్ప తెలంగాణ వాదులు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వాళ్లకు ఓట్లు ఉన్నప్పుడే తెలంగాణ ప్రజలు గుర్తుకు వస్తారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ ఎందుకుని ప్రశ్నిస్తున్నారని, ఇందిరాగాంధీ, సోనియా, రాహుల్ కూడా బతుకమ్మ ఆడారన్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించామని చెప్పారు. జీవో కూడా విడుదల చేశామని గుర్తుచేశారు. ఎన్ని కేసులు పెట్టినా ఊరూరా తెలంగాణ తల్లిని నిలుపుకుంటామన్నారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. బతుకమ్మని అవమానించేలా మాట్లాడిన మంత్రులపై ఏం చర్యలు తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మని తొలగించి చెయ్యిగుర్తు పెట్టారని ఆరోపించారు.

## బంగ్లా అల్లర్లను ఆపలేరా? ఉద్ధవ్ ఠాక్రే

ముంబయి: బంగ్లాదేశ్‌లోని హిందువుల రక్షణకు భారత్ తీసుకుంటున్న చర్యల గురించి ప్రధాని పార్లమెంటుకు తెలియజేయాలని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే కోరారు. ముంబయిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భాజపా పాటించే హిందుత్వం కేవలం ఓట్ల కోసం మాత్రమేనని మండిపడ్డారు. “బంగ్లాదేశ్ లో హిందువులు అణచివేతకు గురవుతున్నారు. ఇస్కాన్ కార్యాలయాలను తగలబెట్టారు. అయినా ప్రధాని మోదీ మౌనంగానే ఉన్నారు. ఒక్క ఫోన్ కాల్‌తో రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ఉన్న ప్రధాని.. బంగ్లాదేశ్‌లో హింసను మాత్రం ఆపలేరా?” అని ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్నించారు. బంగ్లాలో జరుగుతున్న ఘటనలకు వ్యతిరేకంగా నిలబడాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులందరి తరఫున మోదీని అభ్యర్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.ఐక్యత గురించి మన దేశంలో ప్రసంగాలు చేయడంతో ఉపయోగం లేదని.. భారతీయులను హింసకు గురి చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ప్రపంచ దేశాలను చుట్టివచ్చే కార్యక్రమాలలో బిజీగా ఉండడం వల్ల ఆయనకు ఎంపీలను కలిసే సమయం కూడా ఉండట్లేదని ఎద్దేవా చేశారు. మోదీ తరచుగా



విదేశీ పర్యటనలకు వెళ్తుండడం వల్ల ఆయనకు మణిపుర్ అల్లర్లు, బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింస గురించి తెలిసి ఉండకపోవచ్చని అన్నారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో సురక్షితంగా ఉన్నారని.. మరి ఆ దేశంలో కష్టాలు పడుతున్న హిందువుల సంగతి ఏంటి? అని ప్రధానిని ప్రశ్నించారు.

## టీచర్స్ రిక్రూట్‌మెంట్ స్కామ్ కేసులో పార్థా ఛటర్జీకి బెయిల్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కేసులో మాజీ విద్యాశాఖ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నేత పార్థా ఛటర్జీకి బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం తీర్పును వెలువరించింది. 2014-2021 మధ్య కాలంలో పార్థా ఛటర్జీ విద్యాశాఖ మంత్రిగా ఉండగా బెంగాల్ ఉపాధ్యాయ నియామకాల్లో భారీ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే 2022 జులై నెలలో పార్థా ఛటర్జీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది.ఈ అరెస్ట్‌కు ముందు పార్థా ఛటర్జీ,ఆయన సన్నిహితురాలు అర్పిత ముఖర్జీ నివాసంలో సోదాలు జరిపారు. రూ.50 కోట్లు నగదును స్వాధీనం చేశారు. అప్పటి నుంచి ఈ కేసు విచారణ కొనసాగుతుంది. తనకు బెయిల్ ఇవ్వాలని కోర్టును పలు మార్లు అభ్యర్థించారు. తనని రాజకీయ బలుపశువును చేశారని, మిగిలిన జీవితాన్ని సంతోషంగా గడిపేందుకు ఈ కేసులో ఊరట కల్పించేలా బెయిల్ మంజూరు చేయాలని కోర్టులో ఏడ్చేసిన ఘటనలు ఉన్నాయి. ఈ తరుణంలో శుక్రవారం క్యాష్ ఫర్ జాబ్స్ కేసులో సుప్రీం కోర్టు పార్థా ఛటర్జీకి బెయిల్ మంజూరు చేసింది.

క్యాష్ ఫర్ జాబ్స్ కథాకమామిషు

ప్రభుత్వ , ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల



భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ పిటిషన్లపై విచారణ నిమిత్తం కోల్‌కతా హైకోర్టులో ప్రత్యేక డివిజన్ బెంచ్ ఏర్పాటైంది. దీనిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుదీర్ఘ విచారణ జరిపిన ఈ ధర్మాసనం.. 2016 నాటి టీచర్ల నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినందున అది చెల్లదని తీర్పు వెలువరించింది.

## సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ అరెస్ట్



హైదరాబాద్,ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో డిసెంబర్ 4న రాత్రి పుష్ప 2 ది రూల్ (పుష్ప 2 రూల్) బెనిఫిట్ షో నేపథ్యంలో అల్లు అర్జున్ రాక సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి (39) అనే మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు శ్రీతేజ్ (9)కు గాయాలైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉంది.మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌పై ఇప్పటికే నమోదు చేయగా.. తాజాగా ఈ కేసులో చిక్కడ పల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. ఈ మేరకు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పీఎస్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనలో పోలీసులు ఇటీవలే ముగ్గురిని అరెస్ట్ చేశారు. సెక్యూరిటీగార్డ్ సహా థియేటర్ యజమాన్యానికి చెందిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 105 సెక్షన్ (నాన్ బెయిలబుల్ కేసు) కింద ఐదు నుంచి పదేళ్లు జైలు శిక్ష పడే అవకాశం ఉన్నట్టు. కాగా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అల్లు అర్జున్ ఇప్పటికే ఆమె రూ.25 లక్షలు సాయం ప్రకటించారు. ఆమె కుటుంబానికి అండగా నిలిచాడు.

ఎఫ్ఐఆర్ కొట్టివేయాలంటూ పిటిషన్..

కాగా చికడపల్లి పోలీసులు నమోదు చేశారు. ఆ తర్వాత అల్లుఅర్జున్ కూడా పిటిషన్ దాఖలు చేశాడు.

# బండి సైలెన్సర్ మారిస్తే క్రిమినల్ కేసులు

వరంగల్, ద్విచక్ర వాహనాలకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్ మారిసే చట్టరీత్యా నేరమే కాకుండా దాని నుంచి వచ్చే సౌండ్స్ తో పెద్ద ఎత్తున శబ్ద కాలుష్యం, జనాలకు ఇబ్బంది కూడా కలుగుతోంది. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీసులు బైక్ సైలెన్సర్లు మార్చే బైకర్లపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ ఏడాది ఇప్పటికే వరంగల్ కమిషనరేట్ వ్యాప్తంగా వెయ్యికిపైగా సైలెన్సర్లు స్వాధీనం చేసుకోగా.. ఇకనుంచి బండి సైలెన్సర్ మారిస్తే సంబంధిత ఓనర్ల పై క్రిమినల్ కేసులు బుక్ చేసేందుకు రెడీ అవుతున్నారు. కేసుల బారిన పడకుండా యువత సైలెన్సర్ శబ్దాలకు దూరంగా వరంగల్ పోలీసులు సూచిస్తున్నారు. బండ్లను స్టేటస్ సింబల్ గా భావిస్తున్న కొందరు స్టూడెంట్స్, యూత్ స్పోర్ట్స్ బైక్ లు, బుల్లెట్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇక రోడ్లపై వెళ్లే సమయంలో తామే స్పెషల్ అట్రాక్షన్ గా కనిపించాలనే ఉద్దేశంతో బండ్లకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లు మార్చేస్తున్నారు. పెద్ద శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించుకుంటున్నారు. ఇందుకు సైలెన్సర్లను బట్టి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఆ తరువాత పెద్ద సౌండ్స్ తో మెయిన్ రోడ్లపై పరుగులు తీస్తున్నారు. వాస్తవానికి ఇలా సైలెన్సర్ మార్చడం మోటార్ వెహికిల్ యాక్ట్ సెక్షన్ 183 ప్రకారం నేరం. దీంతోనే వరంగల్ ట్రాఫిక్ పోలీసులు ఇటీవల సైలెన్సర్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఈ మేరకు వరంగల్ నగరంలోని హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ రైడ్స్ నిర్వహించారు. ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తంగా 1,142 సైలెన్సర్లు సీజ్ చేశారు. అందులో అత్యధికంగా హనుమకొండ స్టేషన్ పరిధిలో 470, కాజీపేట స్టేషన్ పరిధిలో 352, వరంగల్ స్టేషన్ పరిధిలో 320 సైలెన్సర్లను సీజ్ చేశారు. అనంతరం రోడ్డు రోలర్ల సహాయంతో ధ్వంసం చేశారు. మోటార్ వెహికిల్ యాక్ట్ సెక్షన్ 183 ప్రకారం సైలెన్సర్ మార్పు విషయాన్ని సీరియస్ గా తీసుకున్న పోలీసులు.. ఇకనుంచి పెద్ద సౌండ్స్ చేసే సైలెన్సర్లు అమర్చిన బైకులపై కఠిన చర్యలు చేపట్టేందుకు రెడీ అవుతున్నారు. ఈ మేరకు బండి ఓనర్లపై క్రిమినల్ నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అంతేగాకుండా బండిని సీజ్ చేయడంతో పాటు మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. పిల్లల బండ్లపై తల్లిదండ్రులు కూడా నిఘా పెట్టాలని, పిల్లలు సైలెన్సర్లు మార్చినా తల్లిదండ్రులు కూడా కౌన్సిలింగ్ ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

# పొలిటికల్ రికార్డు !

హైదరాబాద్,మెగా అంటేనే ఒక బిగ్ సౌండ్ వినిపిస్తుంది. మెగా స్టార్ గా దశాబ్దాలుగా సినీ సీమను ఏలుతున్న చిరంజీవి తనతో పాటు ఇతరులనూ ముందుకు తెచ్చారు. అలా మెగా కాంపౌండ్ గా మారి అతి పెద్ద వట వృక్షంగా టాలీవుడ్ సీమలో వేళ్ళూనుకుంది. చిరంజీవికి జనాలలో ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. మరి కొన్నేళ్ళలో ఆయన సినీ అర్ధ శతాబ్ది ఉత్సవాలకూ రంగం సిద్ధం అవుతోంది.ఇక చిరంజీవి అంటే కేవలం సినిమాలకే కాదు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు. ఆయన ప్రజారాజ్యం పార్టీ 18 సీట్లూ 70 లక్షలకు పైగా ఓట్లు సాదించారు. కాంగ్రెస్ లో పార్టీని విలీనం చేయడం ద్వారా రాజ్యసభ సభ్యుడిగా ఆరేళ్ల పాటు చేశారు. మధ్యలో రెండేళ్ళ పాటు కేంద్ర మంత్రిగానూ ఇండిపెండెంట్ చార్జితో పనిచేశారు.అలా చిరంజీవి రాజకీయ రంగ ప్రవేశం ద్వారా తగిన గుర్తింపునే దక్కించుకున్నారు అని చెప్పాలి. ఇక ఆయన సోదరుడు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ పెట్టి 2024లో భారీ విజయం అందుకున్నారు. టీడీపీ బీజేపీలతో కలసి కూటమి కట్టించడంతో సక్సెస్ అయిన పవన్ కి తన కృషికి తగినట్లుగా ఉప ముఖ్యమంత్రి హోదాతో పలు కీలక శాఖలు లభించాయి.ఇపుడు అదే కుటుంబం నుంచి ముచ్చటగా మూడవ వారుగా మెగా బ్రదర్ నాగబాబు రాష్ట్ర మంత్రి కాబోతున్నారు. ఆయన అతి తొందరలో మంచి ముహూర్తం చూసుకుని మంత్రిగా ప్రమాణం చేస్తారు అని అంటున్నారు. అదే కనుక జరిగితే మాత్రం మెగా ఫ్యామిలీలో ముగ్గురు అన్నదమ్ములూ మంత్రి పదవులు అందుకున్న వారే అవుతారు.ఆ విధంగా ఎవరికీ దక్కని ఒక రేర్ రికార్డుని మెగా బ్రదర్స్ క్రియేట్ చేసిన వారు అవుతారు అని అంటున్నారు. తమిళనాడులో కరుణానిధి కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు మంత్రులుగా చేశారు. కర్ణాటకలో దేవెగౌడ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు మంత్రులుగా చేశారు. బీహార్ లో ఆర్జేడీ లో ఇద్దరు అన్నదమ్ములు మంత్రులు అయ్యారు.కానీ ఒకే ఫ్యామిలీలో ముగ్గురు అన్నదమ్ములు మంత్రులుగా చేయడం అంటే అది ఇప్పట్లో ఎవరూ బద్ధలు కొట్టలేని రికార్డు అనే అంటున్నారు. సినీ రంగంలో మెగా ఫ్యామిలీ సాధించిన రికార్డులు అపూర్వం అనే చెప్పాలి. వాటిని బీట్ చేయడం కష్టమే అవుతోంది.ఇపుడు రాజకీయాల్లోనూ ఈ కుటుంబం నెలకొల్పుతున్న రికార్డులు చూస్తే అందరిలోనూ ఆసక్తి కలుగుతోంది ఒకనాడు రాజకీయాల్లో మెగా ఫ్యామిలీ రాణించలేదు అన్న వారే ఇపుడు వారికి దక్కుతున్న రాజకీయ సిరిని చూసి ముక్కున వేలేసుకునే పరిస్థితి ఉంది.అయితే ఇదంతా వారి పట్టుదల కృషి, సమయస్ఫూర్తితో పాటు సరైన వ్యూహాల వల్లనే సాధ్యపడింది అని అంటున్నారు. ఏది ఏమైనా ఒకే కుటుంబం అటు సినీ రంగంలో ఇటు రాజకీయ రంగంలో ఒకే సమయంలో రాణిస్తూ అరుదైన రికార్డులను స్థాపించడం అంటే ఆ ఘనత ఒక్క మెగా ఫ్యామిలీకే దక్కుతుందేమో.ఇప్పటికి మూడు దశాబ్దాల క్రితం మెగాస్టార్ చిరంజీవి హీరోగా వారి సొంత బేనర్ మీద ముగ్గురు మొనగాళ్ళు అని మూవీ వచ్చింది. ఇపుడు ఈ మెగా బ్రదర్స్ కి ఆ టైటిల్ యాప్ట్ అవుతుందని అభిమానులు అంటున్నారు. ముగ్గురు మినిస్టర్లు అని కూడా ఇక ముందు దానిని మార్చి అనుకోవాలేమో అని కూడా అంటున్నారు.

# విశాఖలో గూగుల్ ఆఫీస్

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌కు మరో ప్రతిష్టాత్మకంగా సంస్థ రానుంది. ప్రపంచంలోనే దిగ్గజ సంస్థగా పేరున్న గూగుల్ తన కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించబోతోంది. ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో సమావేశమై చర్చలు జరిపారు. విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు కూడా ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నిరంతరం శ్రమిస్తుంటేనే ఫలితాలు వస్తాయని ప్రయత్నాన్ని ఆపకూడదని వారికి సూచించారు. విశాఖ కేంద్రంగా గూగుల్ కంపెనీ తన కార్యకలాపాలను ప్రారంభించబోతోందని చెప్పారు. ఇది మంత్రి లోకేష్ పట్టుదలతో సాధ్యమైందన్నారు. గూగుల్ ఆఫీస్ యాక్టివిటీస్ ప్రారంభమైతే విశాఖ చరిత్ర మారిపోతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అందుకే నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటే కచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రస్తుతం కాలంలో హార్డ్ వర్క్‌తో సాధ్యం కాని పనులు స్మార్ట్ వర్క్‌తో పూర్తి అవుతున్నాయని చెప్పుకొచ్చారు. మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కి రాష్ట్రంలో చీకటి అమలుకొని ఉందని ఇప్పుడు రెండో కాన్ఫరెన్స్ నాటికి వెలుగు వస్తున్నాయని అన్నారు చంద్రబాబు. గవర్నమెంట్ విజన్ తెలియజేయడానికి ఈ కాన్ఫరెన్స్ ఉపయోగపడుతుందని చెప్పారు. టెక్నాలజీ ద్వారా రాష్ట్రంలో గంజాయి నీ నిర్మూలిస్తున్నామన్నారు. గతంలో పదో తేదీకి కూడా జీతాలు రాని పరిస్థితి ఉండేదని ఇప్పుడు ఒకటో తేదీకి జీతాలు పడుతున్నాయని వివరించారు.

# పాలక పార్టీల పాపమే పోర్టు కబ్జాలు..

అమరావతి,కొన్ని రోజులుగా కాకినాడ సీ పోర్టు, కాకినాడ సెజ్ లోని వాటాలను వైసిపి ప్రభుత్వ హయాంలో బలవంతంగా లాక్కోవటం, రేషన్ బియ్యం అక్రమ రవాణా, అదానీ సోలార్ విద్యుత్ ముడుపుల వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. పాలక పార్టీలు వివిధ పేర్లు, ఒప్పందాలు, బదిలీలు, సంక్షేమం పేరుతో సంపదను, ప్రజల ఆస్తులను ఎలా కొల్లగొడుతున్నాయో, అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ బినామీలకు, ఆప్తులకు, క్రోనీలకు ఆస్తులను ఎలా కట్టబెడుతున్నాయో, పేదల రేషన్ బియ్యాన్ని సైతం ఎలా బొక్కేస్తున్నాయో ప్రజలకు తేటతెల్లం చేస్తున్నాయి. కాకినాడ సీ పోర్టు, కాకినాడ సెజ్ మాదిరిగానే రాష్ట్రంలోని గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానీ తన వశం చేసుకున్నారు. అదానీ అక్రమాలపై విచారణ జరుపుతామని రాష్ట్ర ప్రభుత్వం మాట వరుసకు కూడా అనడం లేదు. అదానీ సోలార్ విద్యుత్ ముడుపులపై కూడా నోరు విప్పటం లేదు. ఎందుకని? ఃకాకినాడ సీ పోర్టు ప్రైవేట్ లిమిటెడ్ (కె.ఎస్.పి.ఎల్)ను, కాకినాడ సెజ్‌లో ఉన్న వాటాలను వైసిపి ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి అండతో వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి, వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి, అరబిందో సంస్థ యజమాని శరత్ చంద్రారెడ్డి భయపెట్టి బలవంతంగా బదలాయింపు చేసుకున్నారని వాటి యజమాని కర్నాటి వెంకటేశ్వర రావు సిబిఐకి ఫిర్యాదు చేశారు. కాకినాడ సీ పోర్టు లోని రూ.2500 కోట్ల విలువగల వాటాలకు రూ.494 కోట్లు, కాకినాడ సెజ్‌లో వున్న రూ.1109 కోట్లు విలువ చేసే వాటాలకు కేవలం రూ.12 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. భయపెట్టి సంతకాలు చేయించుకొని ఆస్తులను బదలాయించుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఈ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించి విచారణ చేపట్టింది. అయితే ఇక్కడ కొన్ని విషయాలను పరిశీలిస్తేనే.. ఈ దోపిడీకి మూలం, బలవంతపు బదలాయింపులు, ఏ పార్టీ ఏమేం చేసింది, ప్రజల సంపదను యథేచ్ఛగా అభివృద్ధి పేర ఎలా కొల్లగొడుతున్నారో అర్థమౌతుంది. కాకినాడ సీ పోర్టును 1997లో రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లతో తన సొంత నిధులతో నిర్మించింది. ఆ తరువాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగానే కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి 22 శాతం స్థూల రాబడిలో వాటాకి పరిమితమై ఒప్పందం చేసుకొని కారుచౌకగా 1999లో ఈ పోర్టును కార్నాటి వెంకటేశ్వరరావుకి ధారాదత్తం చేశారు. అప్పుడు ఆయన టిడిపికి చెందిన వ్యక్తిగా ప్రచారం జరిగింది. వాస్తవంగా అవినీతికి, ప్రజల ఆస్తుల లూటీకి ఇక్కడే బీజం పడింది. ఈ పోర్టును ప్రైవేటీకరించటాన్ని నాటి యాంకరేజ్ పోర్టు కార్మికులు తీవ్ర ఉద్యమం చేపట్టారు. ప్రైవేటీకరణ చర్యల వల్ల ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో యాంకరేజ్ పోర్టు నిర్వహిస్తున్న కార్గో హ్యాండ్లింగ్ సరుకులను ప్రైవేట్‌పరం చేసిన కాకినాడ సీ పోర్టులో ఎగుమతి చేయరని ఒప్పందం చేశారు. ఆ సరుకులు మినహా కొత్త కార్గోకి మాత్రమే పరిమితం అవుతుందని హామీ ఇచ్చారు. ఆ తరువాత ఈ హామీని అధికారంలో ఉన్న పార్టీల అండతో ఉల్లంఘించి చివరికి కేవలం బియ్యం ఎగుమతికే యాంకరేజ్ పోర్టును పరిమితం చేసి వేలాది మంది ఉపాధిని దెబ్బతీశారు.వైసిపి అధికారం లోకి వచ్చిన తరువాత కాకినాడ సీ పోర్టును కర్నాటి వెంకటేశ్వరావు నుండి బలవంతంగా వైసిపి రాజకీయ, పెట్టుబడిదారీ ముఠా గుంజుకుంది. ఇక్కడ మరో విషయాన్ని కూడా అర్థం చేసుకోవాలి. అభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఉపాధి పేర కాకినాడ సెజ్‌ను, దీనికి అనుబంధంగా మరో ఎస్ఇజెడ్ పోర్టు నిర్మాణాన్ని తెర మీదకు తీసుకొచ్చారు. ఇందుకు 10,500 ఎకరాల భూములను రైతుల నుండి బలవంతపు సేకరణకు తెరలేపారు. ప్రజలు ఈ భూ దోపిడిని తీవ్రంగా ప్రతిఘటించారు. 2014 ఎన్నికల్లో సెజ్‌కి భూములు తీసుకోబోమని చంద్రబాబు నాయుడు ప్రజలకు వాగ్దానం చేసినా తీరా గెలిచాక వారి ప్రభుత్వం బలవంతపు భూసేకరణను పాల్పడింది. 2019 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో జగన్ మోహన్ రెడ్డి కూడా చంద్రబాబు మాదిరిగా మాట ఇచ్చి రైతులను మోసం చేశారు. చివరకు జరిగిందేమిటి? కాకినాడ సెజ్ భూమి మొత్తం 10,500 ఎకరాలు కర్నాటి వెంకటేశ్వరావు, జిఎంఆర్‌కి కట్టబెట్టారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు రైతుల భూములను అప్పనంగా పంచేసుకున్నారు. ఆ తరువాత వైసిపి అధికారంలోకి వచ్చాక జిఎంఆర్ 51.26 శాతం వాటాను అరబిందో యాజమాన్యం కొనుగోలు చేసింది. దీంతో కాకినాడ ఎస్ఇజెడ్ పోర్టు కూడా అరబిందో పరమైంది. దీని వెనుక గూడా పెద్ద అవినీతి కథ నడిచినట్లు తెలుస్తోంది. విశాఖ ఎయిర్ పోర్టును మూసేసి భోగాపురంలో కొత్తగా అంతర్జాతీయ ఎయిర్ పోర్టును పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మించాలని చంద్రబాబు నాయుడు 2014లో ముందుకు తీసుకొచ్చారు. 5040 ఎకరాల భూసేకరణకు పాల్పడ్డారు. ఆ తరువాత 2700 ఎకరాలకు పరిమితం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ పోర్టు నిర్మాణం అప్పగిస్తే అత్యధిక ఆదాయ షేర్ ఇచ్చేలా




ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) ముందుకొచ్చింది. ఇది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. 2017లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోర్టు టెండర్లలో మొదటి స్థానంలో నిలిచింది. కానీ చంద్రబాబు ఎఎఐ టెండర్‌ను తిరస్కరించడమేగాక రద్దు చేసి ఆ తరువాత 2019లో జి.ఎం.ఆర్ కి కట్టబెట్టారు. దీనిని ఆనాడు వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యతిరేకించి రద్దు చేస్తామని 2019 ఎన్నికల్లో వాగ్దానం చేశారు.

గెలిచిన తరువాత చేసిందేంటి?

జి.ఎం.ఆర్ సంస్థకు భోగాపురం ఎయిర్ పోర్ట్‌ను కట్టబెడుతూ 2020 జూన్‌లో ఒప్పందం చేశారు. ఆ తరువాత జిఎంఆర్ సంస్థ కాకినాడ సెజ్‌లో ఉన్న 51 శాతం వాటాను రూ.2610 కోట్లకు అరబిందో సంస్థకు అమ్మేసింది. ఈ సొమ్మును 2021లో రూ.1600 కోట్లు, ఆ తరువాత రెండు లేదా మూడేళ్లలో మిగిలిన సొమ్ము అరబిందో సంస్థ చెల్లిస్తుందని తెలిపారు. ఇదంతా పెద్ద గూడు పుఠాణి. భోగాపురం ఎయిర్ పోర్ట్, కాకినాడ సెజ్ వాటా క్విడ్ ప్రో కో (నీకు అంత నాకు ఇంత)లా వుంది. ఈ వ్యవహారంపై చంద్రబాబు నాయుడు నోరు విప్పటంలేదు. ఎందుకంటే జి.ఎం.ఆర్ సంస్థ బిజెపి కి, టిడిపి కి అత్యంత సన్నిహితమైనది కాబట్టి. ఇక దేశంలోని ప్రైవేట్ పోర్టుల్లో అదానీ ముంద్రా పోర్టు తరువాత ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న అతి పెద్దవి గంగవరం, కృష్ణపట్నం పోర్టులు. ఈ రెండిటినీ కాకినాడ సీ పోర్టు కంటే దారుణంగా 2021లో అదానీ కబ్జా చేశారు. ఈ అడ్డగోలు దోపిడీపై టిడిపి కూటమి ప్రభుత్వం నోరు మెదపటం లేదు. ఎందుకంటే మోడీతో అదానీకి ఉన్న సాన్నిహిత్యం అనేది బహిరంగ రహస్యం.. టిడిపి కి కూడా అదానీ మంచి మిత్రుడు. అందుకే అదానీ సోలార్ విద్యుత్ ముడుపుల పైనా స్పందించడంలేదనే విమర్శలు ఉన్నాయి. గంగవరం పోర్టు రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పిపిపి విధానంలో చంద్రబాబు ప్రభుత్వం 2003లో ముందుకు తీసుకొచ్చిన పోర్టు. వాస్తవంగా ఈ పోర్టును విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌కి అనుబంధంగా సమీకృత పోర్టుగా విశాఖ స్టీల్ఎ÷-లాంట్ నిర్మాణంలోనే ఒక భాగం. విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ గంగవరం పోర్టు నిర్మాణానికి ముందుకొచ్చినా ఆనాడు చంద్రబాబు తిరస్క రించారు. విశాఖ పోర్టు ట్రస్ట్ కూడా గంగవరంలో శాటిలైట్ పోర్టును నిర్మిస్తానని ప్రతిపాదించినా అంగీకరించలేదు. చివరికి డివిఎస్ రాజుకి పిపిపి కింద 30 ఏళ్ల ప్రాతిపదికన గంగవరం పోర్టును అప్పగించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం 1000 ఎకరాల భూమి కేటాయించింది. ఆ తరువాత టిడిపి, బిజెపి ఏకమై స్టీల్ఎ÷-లాంట్‌పై ఒత్తిడి తెచ్చి మరో 2000 ఎకరాలు 2003లో డివిఎస్ రాజుకి కట్టబెట్టారు. ఆ సందర్భంగా కూడా గంగవరం పోర్టులో సొంత బెర్తులను నిర్మించుకుంటామని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రతిపాదించినా చంద్రబాబు నాయుడు ససేమిరా అంగీకరించ లేదు. పోర్టుకి భూమి ఇచ్చినందుకు పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి 10.4 శాతం వాటాగా చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ తరువాత డివిఎస్ రాజు తన 89.6 శాతం వాటాలోని 31.5 శాతాన్ని అమెరికా వార్‌బర్గ్ పింకస్ అనే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థకి అమ్మేశారు. అదానీ సంస్థ మొదట 2021లో అమెరికా ఈక్విటీ సంస్థ వాటాను కొనేసింది. ఆ తరువాత అదానీ (కాకినాడ సీ పోర్ట్ యజమాని కర్నాటి వెంకటేశ్వరావును భయపెట్టినట్లే) కేంద్ర బిజెపి నాయకత్వాన్ని రంగంలోకి దింపి ఆగమేఘాల మీద డివిఎస్ రాజు వాటా 58.1 శాతాన్ని దౌర్జన్యంగా బదలాయింపు చేసుకు న్నారు. 2015 నాటికే గంగవరం పోర్టు విలువ రూ.13 వేల కోట్లుగా లెక్కగట్టారు. కానీ 2021లో కేవ లం షేర్ ధరను ఏక పక్షంగా రూ.120గా లెక్క గట్టి రూ.6200 కోట్లకు ఒప్పందం కుదిరినట్లు ప్రకటిం చారు. ఆ సొమ్ము కూడా పూర్తిగా ఇవ్వకుండా అదానీ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో 4.8 కోట్ల షేర్లను (షేర్ ధర రూ.754 చొప్పున) అంటగట్టారు. ఆ తరువాత వైసిపి ని మచ్చిక చేసుకొని రాష్ట్ర ప్రభు త్వ 10.4 శాతం వాటాను ఎటువంటి బహిరంగ టెండర్లు లేకుండానే

# చిరుతల ఆవాసం నల్లమల! మనుగడ కోసం వన సంచారం



సెంట్రల్ డెస్క్: క్రూర జంతువుల్లో పెద్దపులి తర్వాతి స్థానం చిరుత పులిదే. అటువంటి చిరుత పులులు అధికంగా ఉన్న ప్రాంతంగా నాగార్జునసాగర్ - శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రం (ఎన్ఎస్‌టీఆర్) నిలిచింది. ఈ పరిధిలో మొత్తం 270 చిరుతలు ఉన్నాయని మరో 90 ఇదే ప్రాంతంలో సంచరిస్తున్నాయని కేంద్ర గణాంకాలశాఖ ఎన్విస్టాట్స్?-2024 ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. దేశంలో ఉన్న 55 పులుల సంరక్షణ కేంద్రాల్లో ఇక్కడే పులులు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. సింహాలు, పెద్ద పులులు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జీవనం సాగిస్తాయి. చిరుతలు అలా కాదు. అన్ని చోట్లా మనుగడ సాగించగలవు. ఈ కారణంగానే మైదాన ప్రాంతాల్లోనూ అవి సంచరిస్తుంటాయని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

అభయారణ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు..

జీవ వైవిధ్యానికి పుట్టినిల్లు నల్లమల. పెద్ద పులుల ఆవాసానికి అనుకూలంగా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఎన్ఎస్‌టీఆర్ ఏర్పాటు చేసింది. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉండగా అందులో 1,401 చదరపు కిలోమీటర్ల పరిధిలో పులుల అభయారణ్యం ఉంది. ఇందులో ఎనభైకి పైగా పెద్ద పులులు ఉన్నాయి. వీటి సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. స్మగ్లర్ల బారినపడకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వేసవిలో వాటి దాహార్తి తీర్చేందుకు సాసర్ పిట్ల ఏర్పాటు, అగ్ని ప్రమాదాల బారిన పడకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఈ అంశాలు చిరుతపులుల సంఖ్య పెరిగేందుకూ దోహదం పడింది.

పులుల గణన ఇలా..

పెద్ద పులులు, చిరుతల గణనను పలు రకాలుగా చేపడతారు. వాటి పాద ముద్రలను సేకరించడం ఓ పద్ధతి. దీర్ఘచతురస్రంగా ఉంటే ఆడ, చతురస్రంగా ఉంటే మగ పులిగా గుర్తిస్తారు. పెద్ద పులి పాదం 14నుంచి 15 సెం.మీ.లు ఉంటే.. చిరుత పులి పాదం 7 నుంచి 8 సెం.మీ.గా ఉంటుంది. అవి సంచరించే ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేసి కూడా వాటిని గుర్తిస్తున్నారు. ఏ రెండు పులులకు ఒకేలా చారలు, మచ్చలు ఉండవని, వాటిని బట్టి కూడా సంఖ్యను లెక్కిస్తామని అధికారులు అంటున్నారు.

నల్లమలలో చర్యలు భేష్?..

నల్లమల అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ జంతువుల సంఖ్య గతం కంటే పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వివిధ రకాల జంతువులు 436 ఉన్నాయని, అందులో సుమారు చిరుతలు ఎక్కువే ఉన్నాయని అంచనా వేశారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జంతు సంరక్షణ చర్యలే దీనికి ప్రధాన కారణం. వేసవిలో జంతువుల దాహార్తిని తీర్చేందుకు సాసర్ పిట్స్ ఏర్పాటు చేయడం, వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ట్యాంకర్ ద్వారా ఎప్పటికప్పుడు తాగునీటిని అందించడం వంటివి జంతువులు పెరుగడానికి ఎంతో దోహదపడ్డాయని చెప్పొచ్చు.

కొత్త జంతువుల గుర్తింపు

చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని నల్లమల అటవీ పరిధిలో పాలపేడ, ఎర్రపేడ, భూదేవిపెంట, చాకలిచెరువు, దయ్యాలగుట్ట, దాసర్లపల్లి, బచ్చాపురం, కాచరాజుపల్లి తదితర ప్రాంతాల్లో సుమారు 78 ట్రాప్ కెమెరాలు, 46 సాసర్స్ పిట్స్(నీటి తొట్టిలు) ఏర్పాటు చేశారు. 26వేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో వివిధ రకాల మొక్కలు సైతం నాటారు. ఇక్కడికి అమ్రాబాద్ రిజర్వ్డ్ టైగర్ జోన్ దగ్గర ఉండడంతో ఆ ప్రాంతంలోని జంతువులు సైతం దాహార్తిని తీర్చుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. కెమెరా ట్రాప్‌లో కొత్త కొత్త జంతువులను గుర్తించినట్లు ఫారెస్ట్? అధికారులు తెలిపారు. ఇందులో జింకలు, మనుబోతులు, దుప్పులు, చిరుత, నెమలి, అడవి పందులు, అడవి కోళ్లు, ముళ్ల పందులు, అడవి కుక్కలు, నక్కలతో పాటు మరికొన్ని రకాల జంతువులు ఉన్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో నిరంతర గస్తీ ఉంటుంది, బీట్ ఆఫీసర్లు వాచ్ టవర్ ద్వారా ఇతరులు రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటారు.

# సిటీ నడిబొడ్డున పెట్రోల్ ట్యాంకర్లో మంటలు

న్యూఢిల్లీ,హైదరాబాద్ నాంపల్లి ఏక్‌మీనార్ కూడలిలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద అగ్నిప్రమాదం సంభవించింది. హెచ్‌పీ బంక్‌లో హిందుస్థాన్ పెట్రోలియం ట్యాంకర్ పెట్రోల్ నింపడానికి బంకు వద్దకు వచ్చింది. పెట్రోల్ బంక్ లోపలికి వెళ్లాక, అందులోని పెట్రోల్‌ను అన్‌లోడ్ చేయాలి అందుకు ట్యాంక్‌పై ఉన్న లిడ్ తెరుచుకునే క్రమంలో మంటలు చెలరేగాయి. సమయానికి అక్కడ ఉన్నవారు, ట్యాంక్ డ్రైవర్, స్థానికులు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే అటుగా వెళ్తున్న గోశామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి చాకచక్యంగా వ్యవహరించి పెట్రోల్ బంక్‌లోకి వెళ్లకుండా ట్యాంకర్‌ను నిలువరించి బయటకు తీసుకువచ్చారు. “నేను గోషామహల్ వెళ్తున్న క్రమంలో పెట్రోల్ ట్యాంకర్ నుంచి మంటలు చెలరేగటం చూశాను. ఆ మంటలు బంక్‌కు వ్యాప్తి చెందితే చాలా ప్రమాదం జరుగుతుంది. అలా కాకుండా ట్యాంకర్‌ను బయటకు రప్పించాను. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాను. వారు వచ్చి మంటలు అదుపు చేశారని అన్నారు. పెట్రోల్ బంక్‌లో ఉన్నవారిని బయటకు పంపించిన తరువాత అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి అగ్నిమాపక సిబ్బంది, వాటర్ ఫోర్స్, మల్టీ పర్పస్ ఫోర్స్ వచ్చాయి. నాలుగు అగ్నిమాపక శకటాలతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పెట్రోల్ బంక్‌కు మంటలు వ్యాపించి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న తెలిపారు. ఈ రోజు మధ్యాహ్నం ఏక్‌మినార్ దగ్గర పెట్రోల్ బంకులో అగ్నిప్రమాదం జరిగింది. అది పెట్రోల్ ట్యాంకర్ అందులో 15కేఏల్ పెట్రోల్, 5కేఎల్ డీజిల్ ఉంది. ఈ రెండింటిని అన్‌లోడ్ చేసుకోడానికి ట్యాంకర్ వచ్చింది. వాటి చాంబర్స్ తెరవాలి అంటే వాళ్లకి ఓటీపీ వస్తుంది. అది వచ్చాక లిడ్ ఓపెన్ అయింది ఈ క్రమంలో మంటలు వచ్చాయి. వారి దగ్గర ఉన్న ఫైర్ కంట్రోల్ టూల్స్ వాడినా ప్రయోజనం లేకుండా పోయింది. మాకు సమాచారం ఇవ్వగానే ఇక్కడికి వచ్చాం. గౌలిగూడ వాటర్ ఫోర్స్, సెక్రెటరీయేట్ మల్టీ పర్పస్ ఫోర్స్ అందరూ వచ్చి మంటలను అదుపు చేశామని హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న అన్నారు.

# ఇరవై ఏళ్ల నుండి కొనసాగుతున్న అక్రమ సంబంధం

సత్తెనపల్లి, అనుమానంతో ప్రియురాలిని హత్య చేసి పోలీసులకు ప్రియుడు లొంగిపోయాడు. అసలు ఏం జరిగింది? 20 ఏండ్లు రిలేషన్‌లో ఉండి ఎందుకు ఆమెను చంపాడు? సత్తెనపల్లి రంగా కాలనీలో నివాసం ఉండే రమాదేవికి వివాహమైంది.. ఇద్దరు పిల్లలున్నారు. అయితే రాజుపాలెం మండలం కొత్తూరుకు చెందిన వెంకట్రావుతో రమాదేవికి వివాహేతర సంబంధం ఉంది. వెంకట్రావుకి వివాహమై ఇద్దరూ పిల్లలున్నారు. రమాదేవి, వెంకట్రావులకు పెళ్లై పిల్లలున్నా వీరిద్దరి మధ్య గుట్టు చప్పుడు కాకుండా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. దాదాపు ఇరవై ఏళ్ల నుండి వీరిద్దరి మధ్య రిలేషన్ కొనసాగుతుంది. ఈ క్రమంలోనే రమాదేవి తన బంగారాన్ని వెంకట్రావు చేత బ్యాంక్‌లో తాకట్టు పెట్టించింది. అయితే ఇద్దరూ మధ్య ఎటువంటి పొరపొచ్చాలు లేకపోవడంతో అంతా సవ్యంగానే సాగుతోంది. అయితే ఈ మధ్య కాలంలో రమాదేవి సోదరి చనిపోవటం ఇద్దరి మధ్య తగువుకు కారణమైంది. రమాదేవి సోదరి రంగాకాలనీలోనే ఉంటుంది. పక్షవాతంతో మంచం పట్టిన రమాదేవి సోదరి ఈ మధ్య కాలంలో చనిపోయింది. అయితే రమాదేవి సోదరి భర్తతో చనువుగా ఉంటున్నట్లు పుకార్లు వచ్చాయి. అవి వెంకట్రావు దృష్టికి వెళ్లాయి. అయితే మొదట్లో వాటిని కొట్టి పారేసిన వెంకట్రావు.. తర్వాత జరిగిన ఘటనలతో అనుమానం పెంచుకున్నాడు. రమాదేవి తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకొని రమ్మని ఈ మధ్య కాలంలో తరుచూ చెబుతూ వస్తుంది. మరోవైపు మన మధ్య ఉన్న సంబంధాన్ని ఇక కొనసాగించవద్దని చెప్పింది. దీంతో వెంకట్రావు రమాదేవి ఉద్దేశపూర్వకంగానే తనను దూరం పెట్టే ప్రయత్నం చేస్తోందని భావించాడు.బంగారాన్ని విడిపించుకురావాలని పదే పదే అడగటంతో ఈ అనుమానం మరింత బలపడింది. ఈ విషయాన్నే సాకుగా తీసుకున్న వెంకట్రావు రాజుపాలెం రావాలని రమాదేవికి చెప్పాడు. రమాదేవి రాజుపాలెం వచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి అచ్చంపేట రోడ్డులోని గండ్లూరు అడ్డరోడ్డులో ఉన్న పొలాల వద్దకు చేరుకున్నారు. మద్యం సేవిస్తూ వెంకట్రావు రమాదేవికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. అయితే ఆమె మాత్రం బంగారాన్ని విడిపించి ఇక నుండి దూరంగా ఉండాలనే పట్టుబట్టింది. దీంతో కోపాన్ని అణుచుకోలేని వెంకట్రావు ఆమె గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత వెంకట్రావు వెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. మరోవైపు రమాదేవి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులకు రమాదేవి మృతదేహం ఉన్న చోటు గురించి తెలిసింది. వెంకట్రావు తానే చంపానని చెప్పడంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీశైలం దేవస్థానం కీలక నిర్ణయం

శ్రీశైలం,స్పర్శదర్శనంపై శ్రీశైలం దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న రోజుల్లోనూ భక్తులకు స్పర్శ దర్శనం కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు శ్రీశైలం దేవస్థానం నూతన ఈవో శ్రీనివాసరావు కీలక ప్రకటన చేశారు. శని, ఆది, సోమవారాలు, పండుగ రోజుల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆయా సమయాల్లో స్పర్శదర్శనాలు, అభిషేకాలు నిలిపివేస్తూ శ్రీశైలం దేవస్థానం గతంలో నిర్ణయం తీసుకుంది. అయితే.. భక్తుల విజ్ఞప్తితో దేవస్థానం వైదిక కమిటీ, అధికారులతో చర్చించి రద్దీ సమయాల్లోనూ స్పర్శ దర్శనం కల్పించాలని నిర్ణయించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. రద్దీ రోజుల్లో నాలుగు విడతల్లో అలంకార దర్శనం, మూడు విడతల్లో స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే.. సర్వదర్శనం క్యూలైన్లలో సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రోజుకు మూడు విడుతల్లో స్వామివారి స్పర్శ దర్శనానికి అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. గతంలో మాదిరిగానే స్పర్శదర్శనం టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని.. కరెంట్ బుకింగ్‌కు అవకాశం లేదని స్పష్టం చేశారు. శ్రీశైలం ఆలయ దర్శన వేళల్లోనూ మార్పులు చేశామన్నారు ఈవో శ్రీనివాసరావు. ఇక.. కొద్దిరోజుల క్రితమే ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు.. శ్రీశైల దేవస్థానం సిబ్బంది సహకారంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ క్రమంలోనే.. సర్వదర్శనం విషయంలో భక్తుల విజ్ఞప్తులు, సూచనల మేరకు నాలుగు రోజుల క్రితం వైదిక కమిటీ సభ్యులు, దేవస్థానం విభాగాల అధికారులు, పర్యవేక్షకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలోనే.. భక్తులకు విడతలవారీగా మల్లన్న స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అటు.. శ్రీశైలం మల్లన్నను నిత్యం వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. పండుగల సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా.. కార్తీక మాసం, మహాశివరాత్రి రోజుల్లో శ్రీశైలం భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది.

# సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ!!



హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి సహా మరో 11 మంది మంత్రులతోనే రేవంత్ సర్కార్ నడుస్తోంది. ఇంకా మరో ఆరుగురికి కేబినెట్‌లో అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతీ సారి క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బాగా ప్రచారం జరిగింది. కానీ ఇతర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ హైకమాండ్ ఆదిశగా అడుగులు లేయలేదు. కొత్త యేడాదిలో సరికొత్త జోష్‌తో తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపిస్తానని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటనకు తగినట్టుగానే సంక్రాంతిలోపే కేబినెట్ విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఫోకస్ పెట్టింది. దీంతో తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఢిల్లీకి చేరింది. కేబినెట్‌లో కొత్త ముఖాల జాబితా షార్ట్ లిస్ట్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో అధిష్టానం ముందు ఉంచారు. ఇప్పటికే రాహుల్ గాంధీని కలిసి కేబినెట్ విస్తరణపై చర్చించారు. తమ అనుచరులకు కేబినెట్ బెర్తులు ఇవ్వాలని అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క పార్టీ హైకమాండ్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.. అయితే.. దీనిపై మళ్లీ రాహుల్ గాంధీతో చర్చించి ఫైనల్ గా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 11 మంది మంత్రులు ఉండగా ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మాత్రం ప్రాతినిధ్యం దక్కలేదు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరుగురు కొత్త వారికి కేబినెట్‌లో చోటుకి అవకాశం ఉంది. దీంతో కచ్చితంగా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల వారికి కేబినెట్ విస్తరణలో బెర్త్ కచ్చితంగా దక్కే అవకాశం ఉంది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులతో పాటు మిగిలిన మరో రెండు పదవులు ఎవరికి ఏ జిల్లాకు దక్కుతాయనే ఉత్కంఠ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అయితే.. కేబినెట్ విస్తరణలో మిగిలిన మంత్రి పదవుల భర్తీతో పాటు ఇప్పుడు మంత్రులకు ఉన్న శాఖలు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణతో పాటు ఇప్పటికీ ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పోస్టులను కూడా భర్తీ చేస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సీఎం, డిప్యూటీ సీఎం ఢిల్లీ టూర్ల నేపథ్యంలో సంక్రాంతి నుంచి పూర్తి సైన్యంతో సీఎం రేవంత్ రెడ్డి పాలన పరుగులు పెట్టించనున్నారని కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది..

# జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మేరకు పార్లమెంట్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు పెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. గతంలోనే జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సులకు కేబినెట్ ఆమోద్రముద్ర వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. జమిలి దిశగా కేంద్రం తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు రెడీ అవుతోంది. పార్లమెంట్ %శీ% పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు.. అవిపూర్తైన వందరోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు.. అంటే.. వన్‌నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు.. మిగిలిన ఐదేళ్లు పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. 1952లో తొలి సాధారణ ఎన్నికల నుంచి 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే తర్వాతి కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం వంటి కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. జమిలి ఎన్నికలు జరగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ చెప్పింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబంధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు కనీసం 67 శాతం సానుకూల ఓట్లతో ఆమోదించాల్సి ఉంటుంది. అంతేకాకుండా.. ఎన్నికల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న నేపథ్యంలో ఈ బిల్లుకు దేశంలోని కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోద ముద్రవేయాలి. అంటే 543 స్థానాలున్న లోక్‌సభలో కనీసం 67 శాతం అంటే.. 362 ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటువేయాలి. దీంతోపాటు రాజ్యసభలో 245 సీట్లలో 67 శాతం అంటే 164 మంది సభ్యులు ఈ బిల్లును సమర్థించాలి. దీనికి తోడు కనీసం 14 రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉన్నది.జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే లాజిస్టిక్స్ సమస్య అడ్డంకిగా మారుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఈవీఎం




యంత్రాలతో పాటు వందశాతం వీవీప్యాట్స్ అందుబాటులో ఉంచడం అనేది పెద్ద సమస్యని అంటున్నారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచడానికి తగినన్ని గోడౌన్ల కూడా సమస్యగా మారింది. 15 ఏండ్లకోసారి ఈవీఎంలను మార్చాల్సి ఉంది. ఈవీఎంలలో 40% వరకు డెడ్‌లైన్ దాటినవేనని నిపుణులు చెబుతున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికలకు వెయ్యి 115 కోట్లు, 2014లో 3వేల 870 కోట్లు ఖర్చు అయితే.. 2019లో ఈ ఖర్చు పది వేల కోట్ల రూపాయలకు పెరిగినట్లు అంచనా. ఇక శాసనసభ ఎన్నికల నిర్వహణను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఒక్కొక్క రాష్ట్రానికి రూ. 250 కోట్లు ఖర్చవుతుందనుకుంటే, మొత్తం 28 రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు కలిపి అయ్యే ఖర్చు పెద్దమొత్తంలో ఉండబోతోంది. జమిలి వల్ల లాభాలు చూస్తే.. తరచూ వచ్చే ఎన్నికల కోడ్ వంటి అడ్డంకులు తప్పడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టిసారించవచ్చు. ఎన్నికల వ్యయం, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం తగ్గుతుంది. ఓటింగ్ శాతం పెరుగుతుంది. ఒకేసారి ఎన్నికల నిర్వహణతో ఓటు వేయడానికి ప్రజలు తరుచూ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఉత్పాదకత పెరుగుతుంది.నష్టాలు కూడా ఉన్నాయి. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఒకేసారి ఎన్నికలు కష్టం. పారదర్శకతపై అనుమానాలు కలుగొచ్చు. జమిలిపై రాజ్యాంగంలో ప్రస్తావన లేదు కాబట్టి, ఇప్పటికైతే ఇది రాజ్యాంగ విరుద్ధం. గడువులోపే ప్రభుత్వాలు పడిపోతే జమిలి లక్ష్యమే దెబ్బతింటుంది. అవిశ్వాసం ఎదుర్కొనే ప్రభుత్వాల విషయంలోనూ ఇది జరుగొచ్చు. జమిలితో జాతీయ పార్టీలకు మేలు జరుగొచ్చు. జాతీయ అంశాల ఆధారంగా అసెంబ్లీకి కూడా ప్రజలు ఓటేస్తే, ప్రాంతీయ పార్టీలు ఎన్నికల్లో దెబ్బతినే ప్రమాదం ఉంది. జమిలి నిర్వహణకు భారీగా సిబ్బంది, ఈవీఎంలు, వీవీప్యాట్లు అవసరం.

# సుపరిపాలనతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం



అమరావతి,ఆరు నెలల ప్రభుత్వ పాలనపై సీఎం చంద్రబాబు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రజల బలమైన కోరికతో ఆవిర్భవించిన ప్రజా ప్రభుత్వ పాలనలో.. ఆరు నెలలు గడిచిందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు.. సుపరిపాలనతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రమే ఫస్ట్.. ప్రజలే ఫైనల్ అనే నినాదంతో.. ప్రతిక్షణం ప్రజలకు మంచి చేసేందుకు పనిచేస్తున్నామని వివరించారు. స్వర్ణాంధ్ర–2047 విజన్‌తో ఏపీని నెం.1గా నిలబెడతామని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అయ్యింది. ఐదేళ్లలో విధ్వంసమైన రాష్ట్రం, అస్తవ్యస్తమైన వ్యవస్థలు, అప్పులు వారసత్వంగా వచ్చాయి. సంక్షోభాలను అవకాశాలుగా తీసుకొని సంక్షేమంగా మలిచే చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ.. రాష్ట్ర పునర్నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తోంది. పిచ్చిపిచ్చి రంగులు ఉండవు.. మా బొమ్మలు కనిపించవు.. పబ్లిసిటీ కంటే రియాలిటీకే మా ప్రాధాన్యం. రాష్ట్రమే ఫస్ట్...ప్రజలే ఫైనల్ అనే నినాదం కూటమి ప్రభుత్వ విధానంగా అమలు చేస్తూ.. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. అందరి సహకారంతో స్వర్ణాంధ్ర – 2047 విజన్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింపజేస్తాం' అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అయితే.. కూటమి ప్రభుత్వ 6 నెలల పాలనపై వైసీపీ ఘాటైన విమర్శలు చేస్తోంది. చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని.. ప్రజలు మోసం చేశారని ఆరోపిస్తోంది. 'ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు చంద్రబాబు తూట్లు పొడిచారు. అన్ని వర్గాలను నమ్మించి అధికారంలోకి వచ్చాక నయవంచనకు పాల్పడ్డారు. మహిళలు, రైతులు, పిల్లలు, నిరుద్యోగులను నిలువునా ముంచారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలక్షేపం చేస్తున్నారు' అని వైసీపీ ఆరోపిస్తోంది. 'రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం హామీని నెరవేర్చలేదు. ప్రతి మహిళకి ఏడాదికి రూ.18,000 సాయం.. ఉచిత బస్సు ప్రయాణం లేదు. తల్లికి వందనం, యువతకు నిరుద్యోగ భృతిని అమలు చేయడం లేదు. చంద్రబాబు ఆరు నెలల పాలనలో అన్నీ మోసాలే కనిపిస్తున్నాయి. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు.. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఇస్తాం అని చెప్పారు. 46 లక్షల మంది తల్లుల ఎదురుచూస్తున్నారు' అని వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.'ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామన్నారు. వాటి కోసం 54 లక్షల మంది రైతన్నల ఎదురుచూస్తున్నారు. ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. ఇప్పటికే రెండు సిలిండర్లు ఎగనామం పెట్టారు. నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి కోసం లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు' అని కూటమి ప్రభుత్వం పాలనపై వైసీపీ ఫైర్ అవుతోంది.

### రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు..

అమరావతి,కొత్తగా మద్యం విధానం అమల్లోకి రావడంతో ఆంధ్రప్రదేశ్‌లో మందుబాబులు పండుగ చేసుకుంటున్నారు. కొత్త విధానం అమల్లోకి వచ్చిన రోజే వైన్స్, బార్లకు బారులు తీరారు. ఫలితంగా మూడు నెలల్లోనే రికార్డు స్థాయిలోనే భారీగా విక్రయాలు జరిగాయి. మందుబాబులకు మందు.. ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల్లో తీవ్రంగా ప్రభావితం చేసిన మద్యం విధానం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది.

# మెట్రో రైలుకు గ్రీన్ సిగ్నల్!



అమరావతి,బెజవాడ.. అంటే అదొక రాజకీయ వాడ. ఏపీలో రెండో ఆధ్యాత్మిక కేంద్రం. రెండు కొండల మధ్య అవతరించిన తొలి సాగునీటి ఆనకట్ట. జంటనగరాలకు వారధి ఈ బెజవాడ సొంతం. అంతే కాదు. మూడు కాలువలు.. మూడు ప్రధాన రోడ్ల నగరం. అభివృద్ధిలో ప్రభుత్వం ప్రాజెక్టులు ఊసే లేదు. కానీ ఏపీ రాష్ట్ర విభజన సమయంలో.. పునర్విభజన చట్టంలోబెజవాడ తెరమీదకు వచ్చింది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు నిర్మాణం హామీ లభించింది. బెంజిసర్కిల్.. రామవరప్పాడు.. ప్రాంతాల్లో రోడ్ల రద్దీకి తెరపడిందని విజయవాడ నగర ప్రజలు అంతులోని ఆనందం వ్యక్తం చేశారు. కానీ, ఈ హామీ పదేళ్లుగా ఊరింత దశలోనే జనానికి బహుదూరమైంది.తాజాగా కూటమి ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టుల పైళ్ల బూజు దులిపింది. విశాఖ పట్నం, విజయవాడ మెట్రో రైళ్ల డీపీఆర్ తయారీలో నిమగ్నమైంది. ఇక నూతన మెట్రో పాలసీలో రాష్ట్రాల్లోని ఏ నగరంలో మెట్రో రైలు అవసరమని భావిస్తే ఆ రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండానే కేంద్రం మెట్రో ప్రాజెక్టులను నిర్మించే అవకాశం ఉంటుంది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో చోటు చేసుకున్న విజయవాడ.. విశాఖ మెట్రోలను పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. ఈ రెండు ప్రాజెక్టులను పట్టాలపై తీసుకు రావటానికి కేంద్రం సమాయత్తం అవుతోంది. ఈ ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించేలా ప్రతిపాదనలను అధికారులు రూపొందించారు. ఈ రెండు మెట్రో ప్రాజెక్టుల పూర్తి ఖర్చు రూ. 42, 362 కోట్లు కాగా.. కేవలం భూ సేకరణ కోసం ఖర్చు మాత్రమే ఏపీ ప్రభుత్వం భరించనుంది.

**మెట్రో కార్పొరేషన్ రెడీ**

విజయవాడ నగరం.. ఒక రకంగా మహానగరమే. కానీ ఇక్కడ భౌగోళిక పరిస్థితిని పరిశీలిస్తే.. ఈ నగరంలో మూడు ప్రధాన రోడ్లకు ఇరువైపులా నగరం విస్తరించింది. ఒకటి మహాత్మాగాంధీ రోడ్డు ( బందరు రోడ్డు) , కారల్ మార్క్స్ రోడ్డు (ఏలూరు రోడ్డు).. ఇక కోల్కతా ..చెన్నై నేషనల్ హైవే. ఇది గుంటూరు, విజయవాడ జంట నగరాలకు వారధి. ప్రధానంగా ఆసియాలోనే పెద్ద పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ కేంద్రంగా రెండు కారిడార్ల నిర్మాణం తప్పని సరి . ఈ స్థితిలో ఏ రోడ్డుల్లో తొలి మెట్రో రైలు దూసుకుపోతుంది? ఏ రోడ్లను ఖరారు చేస్తారు? అనే ప్రశ్న ప్రజలను ఉవ్విళ్ళూరిస్తుంటే.. ఇక రియలల్టరు,, గత మూడు మాసాలుగా తమ బిజినెస్ ప్లానుల్లో బిజీ బిజీగా ఉన్నారు.

**తెరమీదకు రెండు కారిడార్లు**

ఈ డీపీఆర్ లకు కేంద్రం అనుమతులు రాగానే తొలిదశ మెట్రో పనుల ప్రారంభానికి ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ సిద్ధంగా ఉంది. విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ (పీఎన్‌బీఎస్) నుంచి గన్నవరం వరకు 25.85 కిలోమీటర్లలో కారిడార్ 1 పనులు, పీఎన్ఎస్ నుంచి బందరు రోడ్డు మీదుగా పెనమలూరు వరకు 12.45 కిలోమీటర్లలో కారిడార్ 2 కలిపి మొత్తంగా 38. 40 కిలోమీటర్ల మేరకు మెట్రో పనులు ప్రారంభించాలని భావిస్తోంది. కేంద్రం నుంచి అనుమతులు రావటం తథ్యమని భావించిన ప్రభుత్వం తన కార్యాచరణలో వేగం పెంచింది. విజయవాడ, విశాఖ నగరాల్లో కార్పొరేషన్, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, తదితర శాఖలతో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తోంది. కారిడార్ మార్గంలో ఆయా శాఖలు తక్షణం చేయాల్సిన పనులను చర్చిస్తారు.

**భూసేకరణ సమస్య కాదు**

మెట్రో స్టేషన్లకు భూ సేకరణ పనుల్లోనే ప్రభుత్వానికి అసలు సమస్యలు తలెత్తే పరిస్థితి ఉంది. అది స్వల్పమే. ఎందుకంటే .. విజయవాడ, విశాఖ నగరాల్లో మెట్రో ప్రతిపాధిత ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ ఇప్పటికే జరిగింది. అటు పెనమలూరు నుంచి ఇటు గన్నవరం నుంచి విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ వరకూ సెంటర్ డివైడర్ పై పిల్లర్ల నిర్మాణ పనులకు ఇబ్బందులు లేవు. ఈ స్థితిలో భూసేకరణ కోసం వేచి చూడాల్సిన అవసరం లేదు. అందుకే టెండర్లు పిలిచి పనులు అప్పగించనున్నారు.

**విద్యుత్ తీగల అడ్డంకి లేదు**

మెట్రో ప్రాజెక్టులు అవగానే విద్యుత్ తీగలు కనిపిస్తుంటాయి. పక్క రాష్ట్రాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో విద్యుత్ తీగలతో కూడిన ప్రాజెక్టులే ఉన్నాయి. దేశవ్యాప్తంగా కూడా విధానం కొనసాగుతోంది ఒక్క కేరళ, ఆ తర్వాత మరో రాష్ట్రం తప్ప ఇంకెక్కడా లేదు. కాగా, విద్యుత్ తీగలు లేని మెట్రోల్లో దేశంలోనే మూడోదిగా విజయవాడ మెట్రోకు ప్రాధాన్యం దక్కనుంది. ఈ మెట్రోలో థర్డ్ విధానాన్ని అనుసరించాలని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ భావిస్తోంది ఈ విధానంలో ట్రాక్ నుంచే విద్యుత్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తీగలు ఎక్కడా కనిపించవు.

**అమరావతి కారిడార్ లో 32 స్టేషన్లు**

అమరావతి కారిడార్ లో 32 స్టేషన్లు ఉంటాయి. అన్ని స్టేషన్లు కలిపి 60 వరకు ఉంటాయి. కార్ కోచ్ లు నడుపుతారు. గన్నవరం వద్ద కోచ్ డిపో డిపోను ఏర్పాటు చేయనున్నారు. ఒక మెట్రో రైల్లో 400 నుంచి –450 మంది ప్రయాణించే వీలుంది. జక్కంపూడి వరకు కారిడారు%ా% అక్కడ ఆర్థిక నగరం ఏర్పాటు నేపథ్యంలో 16 కిలో మీటర్ల మేర నిర్మిస్తారు. ఇలా అన్ని చర్చించి సమీక్షించిన పెద్ద మెట్రో డీపీఆర్ ను అధికారులు సిద్ధం చేశారు.

**తొలి దశలోనే బెజవాడ కష్టాలు తీరినట్టే**

విజయవాడ మెట్రో ప్రాజెక్టులో తొలి దశలో రెండు కారిడార్ల పొడవు 38.40 కిలోమీటర్లు. ఒక కారిడారు పండిట్ నెహ్రూ బస్టాండు నుంచి గన్న వరం వరకు(ఏలూరు రోడ్డు వెంట), మరో కారిడార్ పెనమలూరు వరకు నిర్మిస్తారు. గన్నవరం నుంచి పీఎన్బీఎస్ వరకు కారిడార్ 26 కిలోమీటర్లు ఉంటుంది. మరో కారిడార్ పీఎన్బీఎస్ నుంచి పెనమలూరు వరకు బందరు రహదారిపై ఉంటుంది. దీని దూరం 12.5 కి.మీ ఉంది. ఒక్క స్టేషన్ నిర్మాణానికి సుమారు రూ.25 కోట్లు అవుతుందని అంచనా వేశారు. రెండో దశలో పీఎన్బీఎస్ నుంచి అమ రావతికి 27.5 కిలోమీటర్ల దూరం కారిడార్ ఉంటుంది. కృష్ణకాలువ జంక్షన్ మీదుగానే వెళ్తుంది. అమరావతి పరిధిలో దాదాపు 5 కి.మీ ఆకాశంలో, 15 కిలోమీటర్ల వరకు భూగర్భంలో నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఇలా అన్ని అనుమతులతో పనులు చకచక సాగి మెట్రో రైల్ ప్రాజెక్టు తుది దశకు చేరుకుంటే విజయవాడ నగరంలో ట్రాఫిక్ కష్టాలు తగ్గినట్టే.

# సచివాలయంలో ఫేషియల్ రికగ్నేషన్



హైదరాబాద్, తెలంగాణ సచివాలయంలో గురువారం నుంచి ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ అమలులోకి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటలు దాటినా కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగుల సమయపాలనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఫేస్ రికగ్నిషన్‌కు సంబంధించి సీఎస్ శాంతి కుమారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ఫేషియల్ రికగ్నేషన్ విధానంపైనే రోజువారి అటెండెన్స్ నమోదు చేయనున్నారు. గురువారం నుంచి అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఇది వర్తిస్తోంది. సచివాలయం ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం నుంచి ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను తప్పనిసరి చేసింది. అందులో భాగంగా ఇప్పటికే సచివాలయంలోని అన్ని విభాగాల్లో ఫేస్ రికగ్నిషన్ డిజిటల్ మిషన్లను ఏర్పాటు చేసింది. ఉద్యోగులకుసంబంధించిన ఐడీ నెంబర్లతో సహా ఫేస్‌లను మిషన్‌లో అధికారులు నమోదు చేశారు. గురువారం ఉదయం నుంచే ఉద్యోగులు తమ విధులకు హాజరయ్యే ముందు ఫేస్ రికగ్నిషన్ మిషన్‌లో తమ అటెండెన్స్ నమోదు చేసుకుని విధులకు హాజరవుతున్నారు. ఇక నుంచి ఉద్యోగుల అటెండెన్స్, వారి జీతభత్యాల చెల్లింపులు ఈ అటెండెన్స్ ద్వారానే జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో ప్రధానంగా రాష్ట్ర సచివాలయం పాలన విభాగానికి గుండెకాయ లాంటిది. అయితే కొంత మంది ఉద్యోగులు సమయానికి రావడంలేదని, ఇష్టానుసారంగా వస్తున్నారని, 12 గంటల వరకు కూడా కొంతమంది రావడం లేదని.. ఒక వేళ వచ్చినా.. సాయంత్రం 5 గంటలలోపే తిరిగి వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్.. మంత్రులు కొందరు తమ శాఖల్లోని ఆకస్మిక తనిఖీలు చేశారు. ఉద్యోగులు సమయానికి రావడంలేదని తేలింది. అలా రాని ఉద్యోగుల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ అమలులోకి తీసుకువచ్చింది. ఉద్యోగుల సమయపాలన సెక్రటేరియట్ భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ అమలు నిర్ణయం తీసుకుంది.

# వారంలో రెండో సారి.. 16 స్కూళ్లకు బాంబు బెదిరింపులు

ఢిల్లీ: దేశ రాజధానిలో మరోసారి బాంబు కలకలం రేపింది. ఢిల్లీలోని పలు స్కూళ్లకు మరోసారి ఈ–మెయిల్ బెదిరింపులు వచ్చాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదని తెలిపారు. సూళ్లలో బాంబులు ఉన్నాయంటూ బెదిరింపులు రావడంతో ఈ వారంలో ఇది రెండోసారి. ఈస్ట్ ఆఫ్ కైలాష్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సల్వాన్ స్కూల్, మోడరన్ స్కూల్, కేంబ్రిడ్జి స్కూల్స్‌తోపాటు మొత్తం 16 పాఠశాలలకు శుక్రవారం ఉదయం 4.30 గంటలకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రత్తమైన ఆయా యాజమాన్యాలు పిల్లలను స్కూళ్లను పంపించవద్దని, ఒక వేళ పంపితే వెనక్కి తీసుకెళ్లిపోవాలని సమాచారం అందించారు. ఇక ఫైర్ డిపార్ట్‌మెంట్ సహా పోలీసులు, బాంబు డిటెక్షన్ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు స్కూళ్లలో తనిఖీలు నిర్వహించారు. అయితే అనుమానాస్పద వస్తువులు ఏమీ లభించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.అయితే బాంబు బెదిరింపు ఈ–మెయిల్స్‌ను డార్క్ వెబ్ నుంచి పంపినట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. 'మీ విద్యార్థులు స్కూల్‌లోపలికి వచ్చే సమయంలో మీరు తనిఖీలు చేయరని నమ్ముతున్నాను. మేం అమర్చిన బాంబులు భవనాలను ధ్వంసం చేయడంతోపాటు ప్రజలకు ప్రాణనష్టం జరుగుతుంది. డిసెంబర్ 13, 14 తేదీల్లో మీ స్కూళ్లలో ఈ తరహా విధ్వంసం జరగొచ్చు. ఈ నెల 14న పలు పాఠశాలల్లో పేరెంట్ టీచర్ మీటింగ్ జరగడం బాంబులు పేల్చేందుకు మాకు మంచి అవకాశం. మాకు కొన్ని డిమాండ్లు ఉన్నాయి. వాటిని మీరే నెరవేర్చాలి. అందుకు అంగీకరిస్తే వెంటనే మే పంపిన మెయిల్స్‌కు సమాధానం ఇవ్వండి' అని వాటిలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో మెయిల్స్ పంపిన ఐపీ అడ్రస్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం అన్వేషిస్తున్నారు.సోమవారం (ఈ నెల 9న) ఢిల్లీలోని 40కిపైగా స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. వాటిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, జీడీ గోయెంక పబ్లిక్ స్కూల్ వంటివి ఉన్నాయి. పేలుళ్లు ఆపాలంటే 30 వేల డాలర్లు ఇవ్వాలని ఆగంతకులు మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. అయితే పోలీసుల తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో ఇదంతా నకిలీ మెయిల్స్ అని నిర్ధారించారు.



Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com